క్లుప్తంగా

కరెంట్ కష్టాలుండవు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ పరిధిలోని 18 గ్రామాల్లో ఇక కరెంట్ కష్టాలుండవని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని తన కార్యాలయం నుంచి విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్లో ఆదివారం ఆయన మాట్లాడారు. దేవరపాళెంలో త్రీ ఫేజ్ కరెంట్ పనులను పూర్తి చేశారని వివరించారు.

బేలూరు మఠానికి రామకృష్ణ ఆశ్రమం అప్పగింత



నెల్లూరు సిటీ: మూడో మైల్లోని రామకృష్ణ సేవాశ్రమాన్ని రామకృష్ణ మిషన్, బేలూరు మఠం కోల్‌కతా వారికి అప్పగించామని మిషన్ అధ్యక్షుడు మోహన్‌రాజ్, సెక్రటరీ నరసయ్య పేర్కొన్నారు. తద్విదానంద మహారాజు తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రను జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరించిన నిర్వాహకులు

పొదలకూరు : పట్టణంలో ఈనెల 8వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని హిందూ చైతన్య వేదిక నిర్వాహకుడు ఛత్రపతి మస్తాన్‌బాబు కోరారు. ఈ మేరకు స్థానిక ఆంజనేయస్వామి, వినాయక స్వామి దేవస్థానాల్లో శోభాయాత్ర కరపత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. పట్టణ ప్రజలు యాత్రను విజయవంతం చేసేందుకు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

స్థలాన్ని ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారు

విడవలూరు: ఊటుకూరు శంకర్‌నగర్ కాలనీకి చెందిన కొందరు మా స్థలాన్ని ఆక్రమిస్తున్నారని, ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నారని స్థానిక ఇందిరానగర్ కాలనీకి చెందిన కొమరగిరి నాగమణి అన్నారు. ఈ మేరకు అదే గ్రామానికి చెందిన ఇండ్ల సుబ్బమ్మ, ఏకుల మణి ఊటుకూరు శివారులోని వారి స్థలం వద్ద ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి చెందిన చుక్కా పరంధామయ్య అనే వ్యక్తి దాదాపు 40 ఏళ్ల క్రితం ఈ భూములకు పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షుడిగా ఉండేవారని, అప్పుడు తాము దళితులమని, జీవనాధారంగా ఎలాంటి వనరులు లేవని మొరపెట్టుకోగా ప్రభుత్వాధికారులు తమకు జామాయిల్ చెట్లు ఇచ్చి ఇదే స్థలంలో పెంచుకోమని చెప్పినట్లు తెలియజేశారు. అయితే ఈ నేలలో జామాయిల్ సరిగ్గా రాకపోవడంతో తోట ఎండిపోయిందని, అప్పటి నుంచి చాలా కాలం ఈ స్థలం ఖాళీగా ఉండటంతో కంపచెట్లు పెరిగాయని, కొంతకాలం తర్వాత తమ వద్ద డబ్బులు లేక ఈ భూమిని తమ గ్రామంలోనే కొందరికి లీజుకు ఇవ్వడంతో వారు రొయ్యల గుంతలుగా చేసి ఏటా కొంత లీజు సొమ్మును అందించేవారని తెలియజేశారు. ప్రభుత్వం మాకు స్థలం కేటాయించినట్లే శంకర్ నగర్‌కు చెందిన వ్యక్తులకు కూడా స్థలాన్ని కేటాయించిందని, వారు కూడా వారి స్థలాన్ని రొయ్యల గుంతలుగా మార్చుకోగా ఇప్పుడు పక్కనే ఉన్న మా స్థలంపై వారి కన్ను పడిందన్నారు. దీనిపై ప్రశ్నిస్తే తమను చులకనగా మాట్లాడుతూ అవమానిస్తున్నారని తెలియజేశారు. స్థలానికి సంబంధించిన అన్ని పత్రాలు తమ వద్ద ఉన్నాయని, అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రవల్లిక, చెంబేటి పుట్టమ్మ, మణి, లలిత, పొన్నూరు శారద, నాగేశ్వరి, రాపూరు బాబులు, వాసు, విగ్నేష్, భానుప్రసాద్, నాని, నాగేశ్వర్, పోలయ్య, శ్రీధర్, గంగమ్మ, శ్యామల పాల్గొన్నారు.

ఉత్సాహంగా విజ్ఞాన శిబిరాలు



పుస్తకాల ఆవశ్యకతను వివరిస్తున్న లైబ్రేరియన్ నిరూప

విడవలూరు: వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉత్సాహం నింపే దిశగా విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ టి.నిరూప అన్నారు. విడవలూరులోని గ్రంథాలయంలో చిన్నారులకు వివిధ రకాల ఆటల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారతదేశం మొదటి స్థానంలో ఉందని, పాఠశాల నుంచే చిన్నారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ పఠనా శక్తి పెంపొందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధికి ఆమడ దూరం

- రోడ్లు, కాలువల్లేక అవస్థ
- తాగునీటికి కటకట
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- మల్లాయగుంటలో ఇదీ దుస్థితి



దుర్భరంగా రోడ్డు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని 30వ డివిజన్లో గల మల్లాయగుంట అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఈ ప్రాంతంలో దాదాపు వంద కుటుంబాలు నివసిస్తున్నా, వసతులు మృగ్యమయ్యాయి. వీరిలో రేషన్‌కార్డులు కొందరికే ఉన్నాయి. ఇక్కడ సమస్యలు తాండవిస్తున్నా, ప్రజాప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. ఎన్నికల సమయాల్లో కనిపించి, మిగిలిన వేళ పత్తా లేకుండాపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అగచాట్లతో సహవాసం

మల్లాయగుంటలో కనీస వసతులు కరువయ్యాయి. సరైన రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు అనేక అవస్థలు పడాల్సి వస్తోంది. వీధిదీపాల్లేకపోవడంతో రాత్రి వేళ అంధకారం అలుముకుంటోంది. ఇళ్లలోకి విషసర్పాలు ఎక్కడ వస్తాయోనని భీతిల్లుతున్నారు. కాలువల్లేకపోవడంతో మురుగుపారుదలకు అవాంతరం ఏర్పడుతోంది. రోడ్డుపైనే నిల్వ ఉండటంతో దోమల మోత అధికమవుతోంది.

గుక్కెడు నీటికీ కష్టాలే..

తాగేందుకు మంచినీరు లేక అల్లాడుతున్నారు. గతంలో వేసిన రెండు బోర్లు మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. నగరంలో కూలీ పనులు ముగించుకొని తిరిగి ఇంటికెళ్లాలన్నా, సరైన రవాణా సదుపాయం లేదు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

వసతుల్లేక ఇబ్బంది



మల్లాయగుంటలో వసతుల్లేక అల్లాడుతున్నాం. ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ అధికారులు మా ప్రాంతానికి వచ్చి పరిశీలిస్తే, సమస్యలేమిటో వారికి తెలుస్తాయి.

– పోలమ్మ



మరమ్మతులకు గురైన బోరు

రోడ్లు, లైట్లను ఏర్పాటు చేయాలి



రోడ్లు, లైట్లు లేవు. మా ప్రాంతం నుంచి నగరంలోకి వెళ్లేందుకు సరైన సౌకర్యం లేదు. రాత్రి వేళ రాకపోకలు సాగించాలంటే పడరాని పాట్లు పడుతున్నాం.

– ఆదెమ్మ

కాలువల్లేక అవస్థ



తాగునీరు లేక విలవిల్లాడుతున్నాం. పక్క ప్రాంతమైన వైఎస్సార్‌నగర్‌కు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. అక్కడికి ట్యాంకరొచ్చి, మా ప్రాంతానికి రావడంలేదు. కాలువల్లేక రోడ్డుపై మురుగు పేరుకుపోతోంది. వ్యాధుల భయం వెంటాడుతోంది.

– విజయమ్మ

పట్టించుకునే నాథుడేరీ..?



మా ప్రాంతంలోని వారందరూ నిరుపేదలు. కూలీ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. కనీస సౌకర్యాల్లేక ఇబ్బందిగా ఉంటోంది. సమస్యలను అధికారులు పరిష్కరించాలి.

– రాజేష్

ములుమూడిలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్



నెల్లూరు సిటీ: వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని ములుమూడిలో ఆదివారం నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ రైస్ రీసెర్చ్ హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు నాగేశ్వరరావు, లక్ష్మీప్రసన్న హాజరయ్యారు. వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు లలితా శివజ్యోతి, లోకేశ్, మండల వ్యవసాయాధికారి నాగమోహన్, సహాయ వ్యవసాయ సంచాలకుడు నందం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐలో పలువురి చేరిక



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఐలో పలువురు ఆదివారం చేరారు. సంతపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య సమక్షంలో మారం సుధాకర్, లీలామోహన్, దుడ్డు రమేష్‌బాబు, మునిశ్చంద్ర, రషీద్, లక్ష్మయ్యతో పాటు వారి మిత్రబృందం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నేతలు మున్నా, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెంచలయ్య సేవలు అభినందనీయం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఉపాధ్యాయ వృత్తిలో బొడ్డు పెంచలయ్య అందించిన సేవలను విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి కొనియాడారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఏనుగు సుందరరామిరెడ్డి కల్యాణ మండపంలో పెంచలయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పాశం శ్రీనివాస్, హరిబాబుయాదవ్, వైవీ రెడ్డి, శ్రీధర్‌బాబు, పేర్నేటి కోటేశ్వరరెడ్డి, అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ముప్పును తొలగించాలి



నెల్లూరు రూరల్: ప్లాస్టిక్‌తో ఏర్పడుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు గానూ ప్రజలు అవగాహనతో ఉండాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నెల్లూరు విభాగ పర్యావరణ ఇంజినీర్ అశోక్ పేర్కొన్నారు. ప్లాస్టిక్‌తో సంభవించే అనర్థాలపై రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, కూరగాయల మార్కెట్లో అవగాహన కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు.

ఏపీజీబీ అప్రైజర్ల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఆంజనేయులు

నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుల్లో పనిచేస్తున్న గోల్డ్ జ్యువెల్ అప్రైజర్ల సంక్షేమానికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని చీఫ్ మేనేజర్ ఆంజనేయులు పేర్కొన్నారు. రామ్మూర్తినగర్‌లోని ఎస్సార్ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన ఏపీజీబీ జ్యువెల్ అప్రైజర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ అభివృద్ధిలో గోల్డ్ అప్రైజర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. విశ్వబ్రాహ్మణ సంఘ నెల్లూరు అధ్యక్షుడు చెంగయ్య ఆచారి, గౌరవాధ్యక్షుడు రమేష్ కుమార్, కార్పొరేటర్ రామకృష్ణ, వెంకటశేషయ్య, రాఘవ, కల్యాణకుమార్, అప్రైజర్ల సంఘ జిల్లా నేతలు కుర్చేటి శ్రీనివాస్ ఆచారి, రాఘవేంద్ర, రవిశంకర్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



నెల్లూరు(బారకాసు): ఏలూరు ఏఎస్పీగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన రాంబాబును నగరంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం సత్కరించారు. జనతా ఫౌండేషన్ చైర్మన్ దాసరి ప్రసాద్, సభ్యులు నరసింహ, భగవాన్‌రెడ్డి, బద్దిపూడి రాజా, మురళి, చంద్రశేఖర్, ప్రమోద్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించాలని వినతి

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో పలువురు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ పీడీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో నెల్లూరు, కావలి ఈఈలు మోహన్‌రావు, మాధవరావు, జేఏసీ వర్కింగ్ చైర్మన్ మనోజ్‌కుమార్, కోవూరు డీఈ వెంకటేశ్వర్లు తదితరులు సత్కరించారు. డీఈఈలుగా ఉద్యోగోన్నతులను కల్పించాలని కోరారు. విజిలెన్స్ నోటీసులపై మంత్రితో చర్చించారు.

మోడల్ డీఎస్సీ పరీక్ష



నెల్లూరు (టౌన్): డీఎస్సీ మోడల్ పరీక్షను పీఆర్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడారు. పరీక్షకు 500 మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌బాబు, నేతలు భక్తవత్సలం, బాబునాయుడు, హఫీజ్‌బేగ్ పాల్గొన్నారు.

స్వీపింగ్ మెషీన్ ప్రారంభం

నెల్లూరు సిటీ: నగరంలోని 54వ డివిజన్లో గల జనార్దన్‌రెడ్డి కాలనీలో త్రీడీ మీటర్ రోడ్డు స్వీపింగ్ మెషీన్‌ను మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడారు. నెల్లూరులో పరిశుభ్రతకు పెద్దపీట వేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఇన్‌చార్జి కలెక్టర్ కార్తిక్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

⇨ జనార్దన్‌రెడ్డికాలనీలో షాదీమంజిల్ నిర్మాణానికి రూ.50 లక్షల చొప్పున విరాళాన్ని మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. షాదీమంజిల్ నిర్మాణ పనులకు భూమి పూజను చేపట్టారు. అనంతరం ఈ మొత్తాన్ని కమిషనర్ నందన్‌కు అందజేశారు.

⇨ మైపాడు గేట్ సెంటర్‌లో 200 దుకాణాలను ఏర్పాటు చేయనున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. గోమతినగర్‌లో మెప్మా మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ దుకాణాలకు బ్యాంకుల ద్వారా రూ.రెండు లక్షలు, తన సొంత నిధులు రూ.లక్షను అందజేయనున్నామని వెల్లడించారు. మెప్మా పీడీ లీలారాణి పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారాల ప్రదానం



నెల్లూరు(బారకాసు): పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన దేవాంగ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. పొదలకూరు రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో డాక్టర్ మన్నెం సతీష్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో ప్రతిభ చూపిన 115 మంది విద్యార్థులకు ప్రశంసపత్రం, నగదు పురస్కారాలను అందజేశారు. సీపీఐ నేత పముజుల దశరథరామయ్య, అసోసియేట్ అధ్యక్షుడు వెంకటసురేష్, ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య, కోశాధికారి కొండా మాధవయ్య, హాజరతయ్య, జక్కల సురేష్, రాజేంద్రప్రసాద్, కన్నా రాఘవరావు, డాక్టర్ సతీష్‌కుమార్, మన్నెం రవీంద్రనాథ్ టాగూర్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా వెంకటేశ్వరుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిర వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సాయిమాత నిత్యాన్నప్రసాదాలయం ద్వారకామాయిలో శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా ఆదివారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను వేదపండితుడు వేదగిరి ఫణిశర్మ, దాశరథి ఆధ్వర్యంలో అర్చకులు జరిపారు. కల్యాణానంతరం భక్తులకు ప్రసాదాలు, అక్షతలు, ముత్యాల తలంబ్రాలను అందజేశారు. ఉభయకర్తలుగా దేశ్‌పాల్ సింగ్, దేవకీదేవి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ చైర్మన్ మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీ యువజన విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన చీదెళ్ల కిషన్ మర్యాదపూర్వకంగా ఆదివారం కలిసి కృతజ్ఞతలను తెలియజేశారు. నగరంలోని పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో 100 మంది యువతతో కలిసి కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని అనుబంధ సంఘాలకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కమిటీల నియామకాలను పూర్తి చేస్తున్నామని వివరించారు. జిల్లాలో పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారికి పార్టీ పదవుల్లో సముచిత స్థానాన్ని కల్పిస్తున్నామని వివరించారు. యువజన విభాగ నేతలు చక్రి, వంశీ, పవన్, శ్రీకాంత్, నాగార్జున, కిశోర్, హంసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

⇨ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని రామ్‌జీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర మహిళా విభాగ జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి మర్యాదపూర్వకంగా కలిశారు. మొయిళ్ల సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు తల్లి పద్మావతమ్మ మృతి చెందారు. ఈ క్రమంలో పడారుపల్లిలోని వారి నివాసంలో ఆమె పార్థివదేహానికి పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

⇨ అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న 50వ డివిజన్ పార్టీ నేత శౌరిని పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని ఆరాతీశారు.

ఆనం దంపతులను కలిసిన గౌరి



నెల్లూరు సిటీ: జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని చింతారెడ్డిపాళెంలోని వారి నివాసంలో పార్టీ రాష్ట్ర మహిళా విభాగ జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మొయిళ్ల సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

⇨ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, జర్నలిస్ట్ ప్రేమ్‌చంద్ తల్లి పద్మావతి మృతి చెందారు. ఈ క్రమంలో ఆమె పార్థివదేహానికి పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, శ్యామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

⇨ విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, హనుమారెడ్డి నివాళులర్పించారు.

చౌక దుకాణాల్లో సరుకుల పంపిణీ



కార్డుదారులకు సరుకుల పంపిణీ

నెల్లూరు(పొగతోట): కార్డుదారుల సౌలభ్యం కోసం చౌక దుకాణాల్లో రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని చౌక దుకాణాల్లో రేషన్ పంపిణీ ప్రక్రియను ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడారు. రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టామని వివరించారు. కొత్త రేషన్‌కార్డుల కోసం అర్హులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డీఎస్‌ఓ విజయకుమార్, నెల్లూరు అర్బన్ తహసీల్దార్ షఫీమాలిక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి సీఎం కృషి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. నగరానికి ఆదివారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాను జాతీయ రహదారులతో అనుసంధానం చేసి మరింత అభివృద్ధి చేయనున్నామని వివరించారు.

గాండ్ల, తెలికుల విద్యార్థులకు ప్రతిభ ప్రోత్సాహకాలు



నెల్లూరు (బృందావనం): పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గ్రోసు గోపాలయ్య మెమోరియల్ గోల్డ్ మెడల్ బహుమతులను మినీబైపాస్ రోడ్డులోని మహేశ్వరి, పరమేశ్వరి కల్యాణ మండపంలో అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 26 జిల్లాల పరిధిలో ఒక్కో జిల్లా నుంచి ఆరుగురు చొప్పున 156 మంది గాండ్ల, తెలికుల విద్యార్థులకు బంగారు పతకాలు, నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలు, ప్రశంస పత్రాలను తన సొంత నిధులు రూ.పది లక్షలు వెచ్చించి అందజేశామని వివరించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్, తేలి సాహోమహాసంఘటన్ ఢిల్లీ అధ్యక్షుడు మురారి సాహూ, సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నరవ అనంతం, ఉపాధ్యక్షుడు దీనదయాళ్, యువజన అధ్యక్షుడు అశోక్‌సాహూ, జాతీయ మహిళా ఉపాధ్యక్షురాలు భవాని ప్రియ, వెంకటనాగరాజు తదితరులు పాల్గొన్నారు.